క్లుప్తంగా

రామతీర్థంలో వైభవంగా పవిత్రోత్సవాలు



అగ్ని ప్రతిష్టాపనలో భాగంగా పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం యాగశాలలో విశ్వక్సేన ఆరాధన, స్వస్తి పుణ్యాహవచనం, అఘారం, అగ్ని ప్రతిష్టాపన, పవిత్ర శుద్ధి, తదితర కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది రుత్వికుల ఆధ్వర్యంలో రామాయణం, సుందరకాండ, దివ్య ప్రబంధం, శ్రీరామ మూలమంత్ర జపంతో పాటు సుందరకాండ హవనం నిర్వహించారు. సాయంత్రం వేద రుత్విక్కుల ఆధ్వర్యంలో పంచశయనాది వాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ వై శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

మక్కువ ఏజెన్సీలో గజరాజులు



ఎర్ర సామంత వలస గ్రామ సమీపంలో ఏనుగుల గుంపు

మక్కువ: మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో గజరాజుల గుంపు తిరుగుతుండడంతో ఏజెన్సీ వాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండలంలోని ఎర్రసామంతవలస గ్రామ సమీపంలో ఆయిల్ తోటలు, వరి పొలాల పక్కన ఏనుగుల గుంపు సంచరిస్తోంది. కొద్ది రోజులుగా మండలంలో ఎనిమిది ఏనుగుల గుంపు తిరుగుతుండడంతో ఆయా గ్రామాల సమీపంలోనే పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారు. రైతులు సాగు చేస్తున్న వరి పంట పొలాల్లో ఏనుగులు తిరుగుతుండడంతో వరి పంటలు పాడైపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఏనుగులు తిరుగుతున్న ప్రదేశానికి ఎవరూ వెళ్లరాదని, ఎటువంటి కవిపు చర్యలు చేపట్టరాదని అటవీశాఖ అధికారులు దండోరా వేయిస్తున్నారు.

పురుగు మందు తాగిన యువతి మృతి



నవ్యశ్రీ (ఫైల్)

వీరఘట్టం: మండలంలోని గడగమ్మ గ్రామానికి చెందిన కందుల నవ్యశ్రీ(21) ఈనెల 1న పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు గమనించి శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్చగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై ఎస్.షణ్ముఖరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కందుల మధు, శ్రీదేవి దంపతుల చిన్న కుమార్తె నవ్యశ్రీ బీఫార్మసీ చదివింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ చిన్న ఉద్యోగం చేస్తోంది. అయితే తాను ఎం.ఫార్మసీ చదువుతానని ఇటీవల తల్లిదండ్రులకు చెప్పింది. ఎం.ఫార్మసీ చదివేందుకు రూ.లక్షలు ఖర్చు అవుతాయి. అంత ఖర్చు ఇప్పుడు చేయలేమని తల్లిదండ్రులు చెప్పడంతో మనస్తాపానికి గురైన నవ్యశ్రీ,ఈనెల 1న ఇంట్లో ఉన్న పురుగు మందు డబ్బాలో కొంత మందును తాగేసింది. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹270

21 రోజుల తర్వాత కష్టమే..!

- జనన, మరణ నమోదుకు కఠిన నిబంధనలు
- ఆలస్యమైతే అధికారుల చుట్టూ తిరగాల్సిందే
- ఏడాది దాటితే మెజిస్ట్రేట్ ఆదేశాలు
- రెండేళ్లు దాటితే కోర్టు చుట్టూ ప్రదక్షిణలు
- 1వ తేదీ నుంచి అమలవుతున్న కొత్త నిబంధనలు



విజయనగరం మున్సిపల్ కార్యాలయంలో జనన, మరణ నమోదు కౌంటర్ ఎదుట ప్రజలు

విజయనగరం అర్బన్: జననం..మరణం..ప్రతి కుటుంబానికి తప్పనిసరిగా ఎదురయ్యే ప్రక్రియ. కానీ ఇకపై ఈ వివరాలను సకాలంలో నమోదు చేయకపోతే సామాన్యులకు అదనపు ఇబ్బందులు తప్పేలా లేవు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల నమోదుకు 21 రోజుల గడువు విధించడంతో పాటు, ఆలస్యమయ్యే కొద్దీ నిబంధనలను కఠినతరం చేశారు. దీంతో నిర్లక్ష్యం చేసినా.. పరిస్థితుల కారణంగా ఆలస్యమైనా..తర్వాత ధ్రువీకరణ పత్రం కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీల్లో కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. రిజిస్ట్రేషన్ ఆఫ్ బర్త్స్ అండ్ డెత్స్ యాక్ట్–1969లోని సెక్షన్ 13కు చేసిన సవరణల ఆధారంగా ఆలస్య నమోదుకు కొత్త విధానం అమలు చేస్తున్నారు.

21 రోజుల్లోనే సులువు..ఆతర్వాతే అసలు చిక్కు

జననం లేదా మరణం జరిగిన 21 రోజుల్లోపు వివరాలు నమోదు చేస్తే ధ్రువీకరణ పత్రం జారీ ప్రక్రియ సులభంగా ఉంటుంది. కానీ ఆ గడువు దాటితే ఆలస్య నమోదుకు సంబంధించిన నిబంధనలు వర్తిస్తాయి. దీంతో సాధారణంగా రిజిస్ట్రార్ వద్ద పూర్తయ్యే ప్రక్రియ క్రమంగా ఉన్నతాధికారుల అనుమతుల దిశగా వెళ్తుంది. ఏడాది దాటితే జిల్లా మెజిస్ట్రేట్ లేదా డివిజనల్ మెజిస్ట్రేట్ ఆదేశాలు అవసరం. రెండేళ్లు దాటితే ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆదేశాలు తీసుకోవాల్సి ఉంటుంది. అంటే గడువు పెరిగే కొద్దీ దరఖాస్తుదారుపై ప్రక్రియాపరమైన భారం కూడా పెరగనుంది.

పత్రం కోసం..అధికారుల చుట్టూ తిరగాల్సిందేనా?

జనన ధ్రువీకరణ పత్రం లేకపోతే పిల్లల స్కూల్ అడ్మిషన్లు, విద్యా ధ్రువీకరణ పత్రాలు తదితర అవసరాల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. మరణ ధ్రువీకరణ పత్రం లేకపోతే వారసత్వం, ఆస్తి, ప్రభుత్వ పథకాలు, ఇతర అధికారిక వ్యవహారాలు ముందుకు సాగడం కష్టమవుతుంది. ఇలాంటి కీలక పత్రాల విషయంలో కుటుంబాలు సకాలంలో నమోదు చేయకపోతే తర్వాత అదనపు ధ్రువీకరణలు, అధికారుల ఆదేశాలు, కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రావచ్చని ఆందోళన వ్యక్తమవుతోంది.

జిల్లా మారితే..ఇబ్బంది లేదంటున్న అధికారులు

ఒక జిల్లాకు చెందిన వ్యక్తి మరో జిల్లాలో మరణించినా కుటుంబ సభ్యులు తప్పనిసరిగా సొంత కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. పోస్టుమార్టం అనంతరం ఆస్పత్రి ఇచ్చే ధ్రువీకరణ పత్రాన్ని మీసేవా కేంద్రాల్లో సమర్పించి డెత్ సర్టిఫికెట్ పొందే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

ఆలస్యం చేయకుండా వెంటనే నమోదు చేసుకోండి



కేంద్ర ప్రభుత్వ తాజా సవరణ చట్టం ప్రకారం జనన, మరణాల నమోదులో కీలక మార్పులు అమల్లోకి వచ్చాయి. ఏడాది లోపు అయితే తహసీల్దార్ స్థాయిలో పరిశీలన జరుగుతుంది. ఏడాది దాటి రెండేళ్ల లోపు ఆలస్యమైతే ఆర్డీవో స్థాయి అధికారులు విచారణ జరిపి ఉత్తర్వులు ఇస్తారు. ఇక రెండేళ్లు దాటిన పాత కేసుల నమోదుకు మాత్రం ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలు తప్పనిసరి. కోర్టుల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడకూడదంటే, ఇంట్లో ఎవరైనా జన్మించినా లేక మరణించినా అశ్రద్ధ చేయకుండా వెంటనే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

– ఎస్.సుధాసాగర్, ఆర్డీవో, విజయనగరం

ఏజెన్సీ చిన్నారులపై మృత్యు పంజా

- మూడు రోజుల్లో ఇద్దరి మృతి
- ఆందోళనలో తల్లిదండ్రులు



బి.సిమ్మాలమ్మ, సీడీపీఓ, సీతంపేట

సీతంపేట: ఏజెన్సీలో చిన్నారుల వరుస మరణాలు కలవర పెడుతున్నాయి. మూడు రోజుల వ్యవధిలో ఇద్దరు చిన్నారులు మృతి చెందడం తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది. శనివారం వంబరెల్లికి చెందిన రెండు నెలల పసిబిడ్డ రోజంతా గుక్కతిప్పకుండా ఏడుస్తుండడంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు.అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. చిన్నకంబకు చెందిన మరో ఆరునెలల బాలుడు ఉన్నట్టుండి ఇంటివద్ద తీవ్ర అస్వస్థతకు గురికావడంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు.అక్కడ నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. వరుసగా సంభవిస్తున్న ఈ ఘటనలు సీతంపేట ఏజెన్సీలో చిన్నారుల ఆరోగ్యపరిస్థితిపై కలకలం రేపుతున్నాయి.

ఏం జరుగుతోంది..?

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నారు. అయినా చిన్నారులు అనారోగ్యానికి గురై ప్రాణాలు కోల్పోవడానికి పోషకాహారలోపం, రక్తహీనత, తక్కువ బరువు వంటి కారణాలేమైనా ఉన్నాయా? అన్నది పరిశీలించాల్సి ఉంది. ప్రతి చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ జరుగుతోంది. ఎత్తు, బరువులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించే వ్యవస్థ ఏర్పాటు చేశారు. వైద్య శాఖ ద్వారా సకాలంలో టీకాలు వేసే కార్యక్రమం చేస్తున్నారు. ఇన్ని చేస్తున్నా మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల మృతిచెందిన చిన్నారుల వైద్యచరిత్ర, పోషక స్థితి, రక్తహీనత, బరువు, వ్యాధి తీవ్రత తదితర అంశాలు పరిశీలించాల్సి ఉందని పలువురు తెలియజేస్తున్నారు. ఒక్కో చిన్నారి మృతి వెనుక ఒక్కో కుటుంబం తీరని విషాదంలో మునిగిపోతోంది. కారణం పోషకాహార లోపమా..? వైద్యసేవల కొరతా? లేదా మరేదైనా కారణమా అన్నది శోధించాల్సి ఉందని పలువురు తెలియజేస్తున్నారు. వెలుగులోకి వస్తున్న మరణాలు కొన్నైతే, మారుమూల ప్రాంతాల్లో వెలుగులోకి రానివి ఎన్నో ఉంటాయని పలువురు చెబుతున్నారు. మరో చిన్నారి ప్రాణం పోయే వరకు వేచిచూడకుండా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు చెబుతున్నారు.

పోషకాహారం సక్రమంగా అందిస్తున్నాం

చిన్నారులకు సరైన పోషకాహారం అందిస్తున్నాం. ప్రతి రోజూ అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచి ఉంచి పిల్లలను పర్యవేక్షిస్తున్నాం. ఎత్తు, బరువులు ఎప్పటికప్పుడు చూస్తున్నాం. పిల్లల పర్యవేక్షణలో తల్లిదండ్రులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలి.

ఓటమి భయంతోనే ఎస్‌ఎంసీ ఎన్నిక వాయిదా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ అభ్యర్థి సుంకర గణపతి తదితరులు

- అడుగడుగునా దౌర్జన్యం.. అధికార దుర్వినియోగం
- ఎస్‌ఎంసీ చైర్మన్ అభ్యర్థి సుంకర గణపతి ఆరోపణ

గజపతినగరం రూరల్: తొలిసారి వాయిదా అనంతరం ఈ నెల మూడో తేదీన రెండోసారి నిర్వహించిన మండలంలోని లోగిశ పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసి) ఎన్నికల్లో అడుగడుగున దౌర్జన్యాలు, అధికార దుర్వినియోగం స్పష్టంగా కనిపించిందని, అధికారులను తమ గుప్పెట్లో పెట్టుకుని టీడీపీ మద్దతుదారులు ఎన్నిక వాయిదా వేయించారని.. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని లోగిశ జెడ్పీ హైస్కూల్ ఎస్‌ఎంసీ చైర్మన్ అభ్యర్థి సుంకరి గణపతి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రశాంతంగా ఎన్నికలు జరగాలని తాము ఆశించినా.. అధికార పార్టీ అండదండలతో టీడీపీ మద్దతు దారులు రెచ్చిపోయి దాడులకు దిగారని ఆరోపించారు. దూర ప్రాంతాల నుంచి తమకు మద్దతు తెలిపే తల్లిదండ్రులను ఆటోలో తీసుకువస్తే ఆ ఆటోలపై దాడి చేసి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. అలాగే ఓటర్లు కానివారు పాఠశాల లోపలికి ప్రవేశించి గందరగోళం సృష్టించి ఘర్షణకు దిగారని, ఇవన్నీ పోలీసుల సమక్షంలోనే జరిగినా ప్రేక్షకపాత్ర వహించారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తమను రెచ్చగొట్టే ప్రయత్నం కూడా చేశారన్నారు. ఎస్సై కిరణ్ కుమార్ నాయుడిని అధికార పార్టీ నాయకులు తమ ఇళ్లల్లోకి, తమ పార్టీ కార్యాలయంలోనికి పంపించి నానా యాగీ చేయించారని..ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 165 మంది తల్లిదండ్రులు సంతకాలు పెట్టినా ఎందుకు ఎన్నిక నిర్వహించలేదని ప్రశ్నించారు. టీడీపీ మద్దతుదారులకు పూర్తి బలం ఉంటే.. ఎన్నిక వాయిదా పడేది కాదు కదా అన్నారు. ఆ బలం లేకే అధికారాన్ని ఉపయోగించుకుని ప్రధానోపాధ్యాయులు, పోలీసుల సహకారంతో ఎన్నిక వాయిదా వేసే పన్నాగం పన్నారని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ అప్రజాస్వామికమని, దీనికి సంబంధించి తమ వద్ద అన్ని రకాల ఆధారాలు ఉన్నాయని.. న్యాయ స్థానంలో తేల్చుకుంటామని స్పష్టం చేశారు.

మరుభూమి కోసం ముస్లింల ఆందోళన

- స్పందించిన రెవెన్యూ అధికారులు
- స్థలం కేటాయింపు



జాకేరు కూడలిలో మృతదేహంతో బైఠాయించిన ముస్లింలు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామానికి చెందిన ముస్లింలు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలంటూ మృతదేహంతో మంగళవారం ఆందోళన చేశారు. గ్రామానికి చెందిన షేక్ దర్గా మదీనా (48) అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చి ఆందోళన చేపట్టారు. గ్రామపెద్ద బుద్ద అప్పలనాయుడు, వీఆర్వో అప్పలరాము స్పందించి శ్మశానవాటిక పక్కన, లేదంటే సొంత స్థలంలో మూడుసెంట్లు స్థలం ఇస్తామని చెప్పినా ఆందోళన విరమించలేదు. తహసీల్దార్ జె.రాములమ్మ గ్రామానికి చేరుకుని హిందువుల శ్మశానవాటికను ఆనుకుని సర్వే నంబర్ 45/10లో మూడు సెంట్లు స్థలాన్ని కేటాయించారు. ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

కొమెర విద్యార్థి ప్రతిభ



పి.గాయత్రి

రేగిడి: మండల పరిధిలోని కొమెర గ్రామానికి చెందిన పాడి గాయత్రి చక్కని ప్రతిభ కనబరిచింది. ఈ నెల 5న విడుదలైన అగ్రిసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 69వ ర్యాంకు సాధించింది. ఆమె తల్లిదండ్రులు పాడి రామమోహన్, పాడి కవిత వ్యవసాయ కుటుంబానికి చెందినవారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు గాయత్రిని అభినందించారు.

మెగా జాబ్ మేళా రేపు

పార్వతీపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలోని మోడల్ కెరీర్ సెంటర్ సౌజన్యంతో అక్టోబర్ 8న గురువారం పార్వతీపురం మన్యం జిల్లాలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అధికారి సీహెచ్. సుబ్బారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గాయత్రి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు ఈ మేళా జరుగుతుంది. టాటా ఎలక్ట్రానిక్స్, ఫాక్స్‌కాన్, ఫ్లిప్‌కార్ట్, కియా మోటార్స్, మదర్‌సన్, హెటిరోతో సహా మొత్తం 10 సంస్థలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటున్నాయి. 8, 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, బీటెక్ (బ్యాక్‌లాగ్స్ ఉన్నవారూ అర్హులే), ఎంఎస్సీ చదివిన వారు ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయోపరిమితి 18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి. ఎంపికైన వారికి కంపెనీని బట్టి నెలకు రూ.9,500 నుంచి రూ.35,800 వరకు వేతనం చెల్లిస్తారు. సంస్థల నిబంధనల ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐతో పాటు ఉచిత భోజనం, వసతి, రవాణా సదుపాయాలు కల్పిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్ ఫారం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, ఇంటర్వ్యూకు హాజరయ్యేటప్పుడు తప్పనిసరిగా తమ బయోడేటా (రెజ్యూమె), పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను తీసుకురావాలని అధికారులు సూచించారు.

త్రిశూల్‌తో యువత చైతన్యవంతులు కావాలి



మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

పూసపాటిరేగ: త్రిశూల్‌తో యువత చైతన్యవంతులు కావాలని విజయనగరం ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పూసపాటిరేగ మండలం సీహెచ్ అగ్రహారంలో గల ఓ ప్రైవేట్ లే అవుట్‌లో విద్యార్థులు, యువతకు మహిళ భద్రత, రహదారి భద్రత, డ్రగ్స్ పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, యువత రహదారి భద్రత, మహిళలు, బాలల భద్రత, మాదక ద్రవ్యాల పట్ల తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇందులో భాగంగా జిల్లా పోలీస్ శాఖ త్రిశూల్ పేరుతో యువతలో చైతన్యం నింపేందుకుచర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మహిళలు, బాలల భద్రత, రహదారి భద్రత పట్ల ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలికలు, మహిళల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికలపై లైంగికదాడులకు పాల్పడే నిందితులపై న్యాయస్థానాల్లో నేరాలు రుజువయ్యేలా జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన చర్యల ఫలితంగా 35పోక్సో కేసుల్లో 20 సంవత్సరాలకు పైబడి శిక్షలు పడినట్లు తెలిపారు. యువత ఆకతాయిపనులకు స్వస్తి పలికి మహిళలు, బాలికల పట్ల గౌరవ భావంతో మెలగాలని వారికి భద్రత కల్పించడంలో భాగస్వాములు కావాలని యువతకు పిలుపునిచ్చారు. రహదారి భద్రత పాటించకుంటే తప్పు చేయని కుటుంబాలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. కుటుంబాన్ని పెంచే యజమాని లేక వారి పిల్లల భవిష్యత్ అంధకారంలోకి వెళ్తుందన్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించేవిధంగా చూడాలని , రహదారి భద్రతా నియమాలు, నిబంధనలు పాటించాలని కోరారు. యువత డ్రగ్స్, గంజాయికి అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని హెచ్చరించారు. యువత భవిష్యత్‌ను నాశనం చేసే క్రికెట్ బెట్టింగ్స్, రమ్మీ ఆటలకు దూరంగా ఉండాలన్నారు. ఇటువంటి యాప్స్ ఉపయోగించడం వల్ల అప్పుల బారిన పడే అవకాశాలు ఏర్పడతాయన్నారు. యువత మంచి క్రమశిక్షణ, నడవడికతో చదువులపై దృష్టి సారించి భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్.రాఘవులు,భోగాపురం రూరల్ సీఐ ఎన్. శ్రీనివాసరావు, పూసపాటిరేగ ఎస్సై వి. అరుణ్‌కిరణ్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్‌కు ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి, ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జె.జ్యోతిశ్రీ తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీ (బీసీ–ఈ) వర్గాలకు చెందిన విజయనగరం జిల్లా అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోగా కలెక్టరేట్ మొదటి అంతస్తులోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా ఆయా కేంద్రాల్లో సివిల్ సర్వీసెస్ సిలబస్ ఆధారంగా ఆబ్జెక్టివ్ విభాగంలో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన 100 మందిని ఎంపిక చేసి, విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్ శిక్షణ కేంద్రం ద్వారా ఉచిత శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. ఎంపికైన వారికి స్టడీ మెటీరియల్‌తో పాటు భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. అభ్యర్థులు బయోడేటాతోపాటు 10వ తరగతి, డిగ్రీ మార్కులలిస్టు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు జత చేయాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షలోపు ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు ఫోన్ 9866886844, 9603557333 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పారా స్విమ్మింగ్‌లో జిల్లా క్రీడాకారుల సత్తా



హేమవతి సత్యనారాయణ

విజయనగరం: పారా స్విమ్మింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారు. ఇటీవల విజయవాడ గాంధీనగర్‌లోని సర్ విజ్జి మున్సిపల్ స్విమ్మింగ్ పూల్ వేదికగా జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 8వ పారా స్విమ్మింగ్ చాంపియన్ షిప్ –2026 లో జిల్లాకు చెందిన హేమవతి 50 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ గెలుచుకోగా, జాగారణ సత్యనారాయణ 50 మీటర్ల బెస్ట్ స్ట్రోక్ విభాగంలో సిల్వర్ మెడల్, ఫ్రీ స్టైల్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. జాతీయ పోటీలకు ఎంపికైన వారి వివరాలు త్వరలో ప్రకటిస్తారని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె. దయానంద్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను ఆయన అభినందించారు.

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి

గుర్ల: మండలంలోని చుక్కపేట జంక్షన్ వద్ద మంగళవారం ఆటోను బైక్ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో విజయనగరంలోని పల్లివీధికి చెందిన సామేను సామాలమ్మ (63) మృతి చెందింది. విజయనగరం నుంచి చీపురుపల్లి వెళ్తున్న ఆటోను చుక్కపేట వద్ద చీపురుపల్లి నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న సామాలమ్మ ఆటోలో నుంచి జారిపడగా రోడ్డుకు తల బలంగా తగలడంతో తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు స్పందించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పి.నారాయణ రావు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం జంక్షన్, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు: పేరు: శ్రీ జి. నాగేశ్వర రావు (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. 97045 57261, ఇ–మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు: 96669 09050.

ఇ-వేలం ద్వారా మెషినరీ అమ్మకం (హైపోథికేషన్ ప్రకారం)

ఋణగ్రహీతలు : 1) మెస్సర్స్ జెనెసిస్ ఫుడ్ ఇండస్ట్రీస్, ప్లాట్ నెం.56, APIIC ఇండస్ట్రియల్ గ్రోత్ సెంటర్, బొబ్బిలి, విజయనగరం జిల్లా–535558. 2) శ్రీ జోసెఫ్ పియస్ కాస్సీ, తండ్రి : డాక్టర్ అబ్రహం కాస్సీ, డి నెం.1–5–50/201, ఫ్లాట్ నెం.8, హబ్సిగూడ, పబ్లిక్ స్కూల్ దగ్గర, సికింద్రాబాద్–500007. 3) శ్రీ జోసెఫ్ పియస్ కాస్సీ, C/o. అప్పలరాజు, హెచ్.నెం.1–8–5/3, మొదటి అంతస్తు, కుసుమ గజపతి నగర్, కంటోన్మెంట్, విజయనగరం–535003. డిమాండ్ నోటీసు తేది: 30.11.2019. బకాయి మొత్తం: తేది 06.10.2026 నాటికి రూ. 5,27,13,739/– + తేది 07.10.2026 నుండి భవిష్య వడ్డీ మరియు అన్ని ఖర్చులు, ఛార్జీలు మొదలగునవి.

మెషినరీ వివరములు : (1) Sugar Grinder - 1 No, (2) Batch Mixer - 1 No, (3) Chocolate Cream Mixer 3/1, 3/2 - 1 set, (4) Packing Machine - 1 No, (5) Coding Machine and Conveyor 5/1 & 5/2 - 1 set, (6) Oven, Cooling compressor, Drying Ovens, Styler Tank etc., 6/1 to 6/8 - 1 set, (7) Love Ball Machine old - 1 No, (8) Mass cream mixer - 1 No, (9) Electrical Boards 9/1 to 9/6 - 1 No, (10) Tables 2'x3 & 1'x6 - 6 No's, (11) SS shink table - 1 No, (12) SS tank small - 1 No, (13) Executive Office table - 2 No's, (14) Iron office file rack - 1 No, (15) MS damaged Almara - 1 No, (16) Office Executive Chairs - 3 No's, (17) Wooden Almara - 1 No, (18) Iron table with plywood - 1 No.

రిజర్వు ధర : రూ. 35,00,000/- ధరావత్తు : రూ.3,50,000/- బిడ్ పెంపుదల : రూ. 10,000/-

ఇ-వేలం తేది : 22-10-2026, సమయం: ఉ॥ 11:00 గం.ల నుండి సా॥ 04.00 గం.ల వరకు

నియమ నిబంధనలు : 1) మెషినరీ ఖచ్చితంగా "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" అను పద్ధతిలో వేలం వేయబడును. 2) రిజర్వు ధరకన్నా తక్కువ ధరకు మెషినరీ అమ్మబడదు. 3) బ్యాంకు యొక్క అధీకృత అధికారి అమ్మకమును ధృవీకరించిన వెంటనే, విజయవంతమైన బిడ్డరు యొక్క EMD స్వయంచాలకంగా బ్యాంకుకు బదిలీ చేయబడుతుంది; అలాగే, అమ్మకపు ధరలో మిగిలిన 25% మొత్తాన్ని వెంటనే అదే రోజున లేదా తదుపరి పని దినములోపు లోపు చెల్లించవలెను. 4) విజయవంతమైన బిడ్డర్ ఆస్తిని తన పేరు మీదకు బదిలీ చేసుకోవడానికి వర్తించే స్టాంప్ డ్యూటీలు / అదనపు స్టాంప్ డ్యూటీ / బదిలీ ఛార్జీలు, రిజిస్ట్రేషన్ ఖర్చులు, ఫీజులు, GST మొదలైన అన్ని అవసరమైన ఖర్చులను భరించాలి. 5) ఎవరికైనా చెల్లించవలసిన అన్ని చట్టబద్ధమైన / చట్టబద్ధం కాని బకాయిలు, పన్నులు, రేట్లు, అసెస్మెంట్ ఛార్జీలు, ఫీజులు, GST మొదలైన వాటి చెల్లింపు పూర్తి బాధ్యత విజయవంతమైన బిడ్డరే భరించవలెను. 6) ఐడెంటిఫికేషన్ రుజువు (కెవైసి) అనగా స్వయం ధృవీకరణతో ఆధార్ కార్డు / ఓటరు ఐడి కార్డు/డ్రైవింగ్ లైసెన్స్/పాస్‌పోర్ట్ వగైరా కాపీ జతపరచవలెను. ఇవి లేనిచో బిడ్డు తిరస్కరణకు గురికాగలదు. 7) ఎటువంటి కారణం చూపకుండానే వేలం వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు. 8) తేది.07-10-2026 నుండి 21-10-2026 వరకు బ్యాంక్ పనివేళలలో మెషినరీ తనిఖీ చేసుకోగలరు. మెషినరీ తనిఖీ కొరకు సంప్రదించవలసిన నెంబరు: 97045 57261 & 96669 09050. 9) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్‌సైట్ www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices లో ఏర్పాటుచేసిన లింకును రిఫర్ చేయండి. రిజిస్ట్రేషన్, లాగిన్, వేలం యొక్క వివరములు మొదలగు వాటి గురించి సర్వీసు ప్రొవైడర్ M/s. PSB Alliance & M/s. Baanknet యొక్క ఇ-వేలం పోర్టల్: https://baanknet.com/eauction-psb/x-login & టోల్ ఫ్రీ ఫోన్ నెం.: 91- 8291220220, Mail ID: support.baanknet@psballiance.com ను సంప్రదించండి.

తేది: 06.10.2026, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఆటో, బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు



క్షతగాత్రుడిని 108లో పార్వతీపురం తరలిస్తున్న వైద్యసిబ్బంది, కుటుంబసభ్యులు

సీతానగరం: మండలంలోని ప్రధానరహదారిపై హనుమాన్ జంక్షన్ వద్ద ఆటో ద్విచక్రవాహనం 'ఢీ'కొట్టిన సంఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి గాయాలపాలయ్యాడు. దీనిపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాలూరు నుంచి పార్వతీపురం పేపర్ ప్లేట్ల లోడ్‌తో ఆటో వెళ్తుండగా సీతానగరం మండలంలోని హనుమాన్ జంక్షన్ దాటుతున్న సమయంలో సీతానగరం గ్రామంలోని సుంకరివీధికి చెందిన కర్రోతు మహేష్ హైవేరోడ్డుకు ఎడమ భాగాన ఉన్న హడ్కో కాలనీ రోడ్డు నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి రోడ్డు దాటుకుని వస్తుండగా ఆటో ఢీకొట్టడంతో తలకు గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంపై నుంచి మహేష్ కిందకు పడిపోవడంతో రోడ్డు తగిలి తలకు గాయాలయ్యాయి. గాయాల పాలైన వ్యక్తిని గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్ పి.ఉషారాణి ప్రాథమిక వైద్యసేలందించిన అనంతరం మెరుగైన వైద్య సహాయం నిమిత్తం 108 వాహనం సహాయంతో పార్వతీపురం ప్రభుత్వ జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. సీతానగరం పోలీసులు ప్రమాద జరిగిన స్థలాన్ని పరిశీలించారు.

పిచ్చి కుక్క దాడిలో నలుగురికి గాయాలు



కుక్క కాటుకు గురైన క్షతగాత్రుని చేతులు

చీపురుపల్లి: పట్టణంలోని దేవాంగులవీధిలో పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. ఏకకాలంలో ఒకే కుటుంబంలోని నలుగురు వ్యక్తులపై దాడి చేసి స్థానికులను ఆందోళనకు గురి చేసింది. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో దేవాంగులవీధిలో వాకిట్లో నిలబడిన పండిత సంతోష్ కుమార్, పండిత విష్ణుప్రియ, పండిత కళ్యాణి, పండిత గోవర్ధన్‌లను పిచ్చి కుక్క ఇష్టారాజ్యంగా కరిచి అక్కడి నుంచి పరారైంది. అకస్మాత్తుగా వీధిలోకి వచ్చిన పిచ్చి కుక్క స్థానికులను కరిచి వేస్తుండడంతో స్థానికులు గుర్తించి వెంబడించగా అక్కడి నుంచి సమీపంలోని రైల్వేస్టేషన్ వైపు పరుగులు తీసి పరారైంది. దీంతో కుక్క కాటుకు గురైన వారిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ వారికి టీకాలు వేశారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



జగదీష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్సై

విజయనగరం టౌన్: విజయనగరం రూరల్ మండలంలోని జొన్నవలస గ్రామానికి చెందిన దొంతల జగదీష్ (30) మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. జగదీష్‌కు అదే గ్రామానికి చెందిన అమ్మాయితో వివాహం జరిగింది. వారికి ఓ పాప కూడా ఉంది. చిన్నపాటి కూలిపని చేసుకుంటూ జీవనం సాగించే జగదీష్‌కు వేరే అమ్మాయితో వివాహేతర సంబంధం ఉంది. అయితే ఆ అమ్మాయి తనను పెళ్లిచేసుకోవాలని కోరుతూ మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదుచేశారు. 53 రోజులు జైలుశిక్ష అనుభవించిన తర్వాత తిరిగి తన భార్యా,బిడ్డను చూసేందుకు వెళ్లాడు. పెద్దల సమక్షంలో అన్నీ తేలిన తర్వాతనే వస్తానని భార్య చెప్పడంతో మనస్తాపం చెందిన జగదీష్ తన ఇంటికి చేరుకుని ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. మృతుని తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై వెలమల ప్రసాదరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ మోక్షిత్ ఎంటర్‌ప్రైజెస్ (సోలర్ ఎనర్జీ) లో బైపాస్ రోడ్, భాస్కర గ్రౌండ్ ఎదురుగా, పార్వతీపురం పనిచేయుటకు ఒక్కరు ఫిమేల్ సిబ్బంది కావలెను. కాంటాక్ట్ నెంబర్స్ 98482 82496, 94930 88657. [S-1321371]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. Ph: 8977639662, 8977639663 [SCA26014156]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.